ఆ వేళకి, ఆ వీధి రోజూ దాదాపు నిర్మానుష్య మవుతుంది. అక్కడ భయంకర నిశ్శబ్దం తాండవిస్తుంది. రాత్రి పదకొండు, పన్నెండు గంటల మధ్య అది సహజం. అది నేను రాత్రి డ్యూటీ ముగించుకుని వచ్చే వేళ. వీధుల్లోని సవ్వడి ఇళ్ళలో దూరి, నిద్ర పోయే వేళ

ఒక ఇంట యువదంపతుల అదిరే అధరాల అమృతపు విందులు...మరొక ఇంట పసిపిల్ల తల్లి రొమ్ములో తల దూర్చి చేసే చిలిపిచేష్టలు. వేరొక ఇంట అలసిపోయిన యిల్లాలు మగతనిద్ర, కలవరింతలు. ఇంకొకచోట ఒంటరి యవ్వనం జంటకోసం అన్వేషణ...

అదీనేను ఇంటికితిరిగివచ్చే సమయం.

ఆ ఇంట్లోంచి ఓ ఇల్లాలి ఆర్తనాదం వినిపించే సమయం

పాపం. ఆ మేడమీద కాపురం చేస్తున్నది ఎవరోనని అనేకమార్లు అనుకున్నాను.

అక్కడకు వచ్చేసరికి నా గుండె గుభిల్లు మంటుంది. కాళ్లు భయంతో వణుకుతాయి. నా చూపులు అప్రయత్నంగా, ఆ మేడపైకి ప్రసరిస్తాయి. ఎవరూ కనిపించరు. చీకటిని చీల్చుకుంటూ వచ్చే ఏడుపు మాత్రం వినిపిస్తుంది. దుర్భరమైన కేకలు, అరుపులు, ఆర్తనాదం...

* * *

ఆమె కిటికీవద్ద నిలబడి దైన్యంగా వీధిలోకి చూస్తుంది. ఆ కళ్ళు చీకట్లో, ఆశాదీపాలు. కర్టెన్ పక్కకు వత్తిగిలించి, కమ్మికి తల ఆన్చి, ఉబికి వస్తున్న దుఃఖాన్ని పెదాల వెనుక దాచ ప్రయత్నిస్తోంది, ముహూర్తం వేళ ఆసన్న మవుతుంటే, ఆశ, ఆ వెంట భయం, నిరీక్షణలో ఆనందం ఆనందం చివర గుండె మంట...అది అనుభవం..

అడుగుల చప్పుడు...ఆ చప్పుడు ఆమెకు అనుభవమే...తను ఎదురు చూచేది ఆ చప్పుడు కోసమేనన్నట్లు నీల తలెత్తి చూసింది

'ఆయనే' అనుకుంది.

కళ్లలో కాస్తంత ఆశ.

మందంగా గేటు తెరచిన సవ్వడి. మేడమెట్లు ఎక్కుతున్న అడుగుల పైనం. ఆయనే...అనుమానంలేదు. కళ్ళు వత్తుకుంటూ వెళ్ళి తలుపు గడియ తీసింది.

ఆమె నీల......అలంకరించుకోక పోయినా అందంగానే వుంటుంది. అపరంజి బొమ్మ...మూర్తీభవించిన యవ్వనం ఆమె. కానీ ఆమె యవ్వనం అడవికాచిన వెన్నెలవంతు.

ఆమెను విసురుగా తోసుకుంటూ, లోపలకు నడిచాడు అతను. అతని మొహం బరువుగా వుంది. కళ్లు ఎర్రగా, జ్యోతుల్లా వున్నాయి. అతను మన్మధరావు. ఆమెకు తాళికట్టిన భర్త. అతన్ని చూడగానే నీల మొహం విచ్చుకోబోయి ముడుచుకుపోయింది నిట్టూర్పు తెర వేసి, తలుపు గడియ పెట్టింది.

"భోజనం చేయరూ?" అంది, గొంతులోని దుఃఖాన్ని గుండెలోకి నెడుతూ. అందుకు అతని సమాధానం లేదు. పైగా, "లైటు ఆర్పు" ఆజ్ఞ... మరొక నిమిషంలో లైటు ఆరిపోయింది.

మరో అయిదునిమిషాలు ..ప్రళయం ...అతను ఆమెను కొట్టిన శబ్దాలు... ఆమె ఏడ్పు...అరువులు...వెక్కి వెక్కి ఏడుస్తోంది. దెబ్బలు భరించలేక ఏడుస్తోంది.

"నన్ను చంపకండి...బాబోయ్ చచ్చిపోతున్నాను." ఆమె అరుపులు ఆ నిశీధిలో ఎవరు వింటారు? విన్నా ఎవరు కల్పించుకుంటారు! వారు భార్యాభర్తలు...భార్యాభర్తల మధ్య, ప్రేమ

విషయంలో, ద్వేషం విషయంలో జోక్యం కలిగించుకోగల పెద్దమనిషీ లేదు, చట్టమూ లేదు. ఇది భారతదేశం... కర్మ శాపగ్రస్థమైన పవిత్రదేశం ఇది.

* * *

భర్త వెచ్చని కౌగిలిలో మత్తుగా పడుకున్న రజని త్రుళ్ళిపడి లేచింది. వేణు ఆమెను కదలనివ్వకుండా పట్టుకుని "పడుకుంటూ, రోజూ వుండే గొడవేగా" అన్నాడు. అన్నా, ఆమె గుండె దడ తగ్గలేదు. పాటి ఆడది, అందునా తన స్నేహితురాలు నీల అలా దెబ్బలకు తట్టుకోలేక విలవిల్లాడిపోతుంటే, తను భర్త కౌగిలిలో ఎలా సుఖించగలదు!

"ఛీ ఉండండి," అంటూ లేచింది. వేణు రజని పెదవుల్ని గట్టిగా ముద్దాడి 'ప్చో' అన్నాడు, అలక వహించి

"పాపం, నీలను చంపేస్తాడేమోనండి, దుర్మార్గుడు" అన్నది అతని గుండెలమీద సుతారంగా వేళ్లతో నిమురుతూ.

"అందుకని మనమేం చేస్తాం?"

"మగబుద్ధి పోనిచ్చారుకారు, మీ స్వార్థమే మీది. పాటి మనిషి చచ్చినా, బతికినా పట్టదు" గారం పోయింది.

"ఏం చేద్దాం చెప్పు" అన్నాడు, ఆమెను గుండెలపైకి లాక్కుంటూ. "పోనీ పుట్టింటికైనా పోవే అంటే విని చావదు గదా" స్వగతం. ఒక రోజున అదే జరిగింది.......

"పారిపోరాదూ" అని తను సలహా యిచ్చింది....

"ఇంకా నయం, 'లేచిపోరాదూ! అన్నావు కాదు' అన్నది నీల. పైగా "మగాళ్ళంతా అంతేలే" అన్నది, ఊరడింపుగా.

"నీ బొంద... మేం, మీలాగా కొట్టుకు చస్తున్నామా" అని నిలదీసింది తను.

"నా కర్మ" అన్నది నీల.

"కాదు చేతకానితనం... అలాటి

మొగుడితో సుఖపడడం కన్న, మొగుడు లేకుండా ఉండడం హాయి" అన్నది తను

"నిజమే...'మబ్బు విడిచిన ఎండ, మొగుడు వదిలిన ముండ' అంటారు అందరి కళ్ళు అప్పుడు నా మీదే వుంటాయి...ఆ నరకంకన్నా ఇదే నయం కదూ" అన్నది నీల

"వదిలెయ్ వెధవ మొగుడ్ని...నీవు 'క్లో' అంటే కోటిమంది వస్తారు పువ్వుల్లో పెట్టి పూజిస్తారు. నీకేం అందం తక్కువా ! చదువు తక్కువా ! హాయిగా ఉద్యోగం చేసుకున్నా బ్రతగ్గలవు" అని తను సలహా యిచ్చింది.

నీల నవ్వింది.

"ఆయన తాగినప్పుడే అలా వుంటారు. కొడతారు. మిగతావేళల్లో నేనంటే ఎంతో ప్రేమ "

"సిగ్గులేకపోతే సరి."

* * *

నీలా, రజనీ క్లాస్‌మేట్స్ ఒకే వీధిలో ఉండడంతో మరీ అన్యోన్యంగా పెరిగారు. అందరూ వాళ్ళను అక్క-చెల్లెళ్ళనేవారు. బి. ఎ. చదువుతుండగానే రజని పెళ్ళి అయింది. పెళ్ళి కాగానే చదువు మాని కాపురానికి వెళ్ళింది నీల డిగ్రీ తీసుకునిగానీ పెళ్ళిచేసుకోనని పట్టుబట్టింది. అన్నట్లే నీల బి. ఎ మన్మధరావును చూడగానే మనసిచ్చింది. అతని అందం, ఠీవి, ఉద్యోగం నీలను బందీ చేశాయి. మన్మధరావు ఎమ్. ఎ పాసైనాడు లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు అంతకన్నా ఏం కావాలి అనుకుంది నీల. పైగా తనంటే ఇష్టమని స్పష్టంగా చెప్పాడు. ఎంత ఫ్రాంక్, ఓపెన్ హార్టు అనుకుంది.

అనుకోకుండా నీల భర్తకు, అంటే మన్మధరావుకు, హైదరాబాదుకు బదిలీ అయింది. అప్పుడే రజని వాళ్ళ క్రింది పోర్షన్ ఖాళీ కావడమూ జరిగింది. ఇలా వస్తున్నామని నీల రాయగానే రజని తన భర్తతో చెప్పింది. మన ఇల్లు నీలవాళ్ల కిద్దాం. నాకు తోడుగా వుంటుంది. నా బెస్ట్ ఫ్రెండ్, అమె అని

సరే నన్నాడు వేణు కాదనేపాటి సంస్కారం అతనికి లేదు అతను పెద్దగా చదువుకోలేదు మరి...తాము క్రింది పోర్షన్‌కు మారి, చిన్నదైన పై పోర్షన్ నీల కుటుంబానికి కేటాయించారు. అద్దె అసలు వద్దు అన్నారు గానీ,మన్మధరావు మరీ మొహమాటపెట్టి, ఓ ఏర్పాటు చేసుకున్నాడు.

ఇంటిలో చేరబోయే ముందు యిచ్చిన అడ్వాన్సు తప్ప. ఈ ఆరునెల్లో మళ్ళీ మన్మధరావు అద్దె యిచ్చిన పాపాన పోలేదు, ఇవ్వాలన్న ప్రయత్నమూ చేయలేదు

ఒకరోజున రజని మేడపైకి వచ్చింది. అద్దె సంగతి ప్రస్తావించాలనికానీ నీలను చూచి నోరు మెదపలేకపోయింది అమె మెడలో వుండవలసిన మంగళసూత్రం

'తాడు' కనిపించలేదు. చేతికి ఉండవలసిన బంగారు గాజులు లేవు. చెవుల కమ్మలు లేక మరీ బోసిగా వుంది.

"అదేమిటే నీలూ, మరీ నగలన్నీ తీసేశావు" అంది రజని. నీల నవ్వింది బాధగా...కళ్ళు వొత్తుకుంది.

"కూర్చో ... కాఫీ తెస్తా" అని వంటగది వేపు నడిచింది. పెల్లుబికి వస్తోన్న దుఃఖం ఆపుకోలేక.

ఆడదాని మనస్సు గ్రహించడం ఆడవారికే సాధ్యం.

రజని విసవిస మన్మధరావున్న గదిలోకి వెళ్ళింది.

"ఏమండీ మన్మధరావుగారూ! మీ కంటే చిన్నదాన్ని, అయినా ఒక విషయం చెప్పాలని వచ్చాను" అన్నది కోపంగా చూస్తూ....

"నేను మీ సలహా అడిగినప్పుడు చెబుదురుగానీ..." వ్యంగ్యంగా అన్నాడు.

రజని కోపం నసాళానికెక్కింది.

"చదువుకున్నవారనీ, మంచి వారనీ ..."

ఇంకా అనబోతుండగా ... "నాకు సర్టిఫికేట్లు వున్నాయి చూపిస్తాను కావాలంటే" అన్నాడు.

"అవి చూసే మోసపోయింది మా నీలవేణి. మిమ్మల్ని చూసేవరకూ నీల అదృష్టవంతురాలనుకున్నాను."

"కాదని ఆవిడ చెప్పిందా?"

"ఒకరు చెప్పాలా, మీ ప్రవర్తన నాకు నచ్చలేదు."

"నష్టమేం లేదనుకుంటా"

"కానీ మా ఇంట్లో వున్నారు కనుక, నీల నా ఫ్రెండ్ గనుక నాకూ బాధ్యత వుంది."

"అయితే ఇల్లు ఖాళీ చేయమంటారు."

"మీ కేం, అవసరాన్నిబట్టి ఇల్లు మార్చగలరు, ఇల్లాల్ని మార్చగలరు. కానీ మనస్సు మార్చుకోలేరు. మనస్సు మార్చుకోరు."

"ఇల్లాల్ని కూడా మార్చమంటారా! మీ కిష్టమైతే."

"యూ షటప్...స్కౌండ్రల్."

"థాంక్స్."

రజని విసవిస మేడ దిగింది... అతని మొహం చూడాలంటే అసహ్యం. అతనన్న మాటలు వేణుతో ఎలా చెబుతుంది...చదువు పెద్దగా లేకపోయినా తన వేణు ఎంత యోగ్యుడు. ఛా ... ఆడపిల్లలు డిగ్రీల్ని అందాన్ని ప్రేమిస్తారు యోగ్యతల్ని ప్రేమించరు.

నీల సంసారంతో పోల్చితే తనది స్వర్గసీమ. తన భర్త చీకటిపడే వేళకు ఇంటికి వస్తాడు. తనను రెప్పలా చూచు కుంటాడు. పాపం! నీల భర్త తప్ప త్రాగి, ఏ అర్ధరాత్రికో వస్తాడు. దాన్ని చావగొడతాడు. నీల సంసారం ఒక మార్గానపడడం ఎలా? ఆలోచించింది రజని.

రోజులు గడుస్తున్నాయి.

రజని నిరీక్షిస్తోంది. కిటికీవద్ద నిలబడి, మన్మధరావు కోసం...ఇది వరకు నీల అలాగే నిరీక్షించేది.ఇప్పుడు తను.

అతను వస్తున్నాడు, ఆటో లో తూలుతూ, అడుగులు తడబడుతూ దిగాడు.పడిపోతాడేమోననిపిస్తోంది.మేడ మెట్లు ఎక్కుతున్నాడు, మత్తుగా...పైన 'నీల'తలుపు తెరిచింది...లైటు వేసింది. అయిదు నిమిషాలకు లైటు ఆరింది.

మన్మధరావు చెయ్యెత్తాడు....నీల సిద్ధంగానే వుంది. దెబ్బ పడలేదు. కానీ పెడబొబ్బలు...అరుపులు...కేకలు ఎవరో పెడ పెడ కొడుతున్నారు... దెబ్బ మీద దెబ్బ...మన్మధరావు ఎత్తిన చెయ్యి అలాగే దిగిపోయింది. తూలుతూ కిటికీ వద్దకు పరుగుతీశాడు. క్రింది పోర్షన్ నుండి అరుపులు.

"మీ రజని కదూ" అన్నాడు నీల వైపు చూస్తూ.

"అమ్మోయ్, బాబోయ్, చచ్చాను నాయనోయ్." రజని గొంతు.

"బావుంది.ఈ గాలి క్రిందికి వీచిందన్న మాట. ఆరునెలలు సావాసం చేస్తే వారు వీరవుతారుట, నిజమే" అన్నది. మన్మధరావు మత్తు దిగింది.

"వేణుగారికి తాగే అలవాటుందా?" ఆసక్తిగా అడిగాడు.

"తెలియదు. నేర్చుకున్నాడేమో" అన్నది బాధగా.

"పాపం, రజనిగారు మంచిదికదూ" అన్నాడు మన్మధరావు.

* * *

మర్నాడు మన్మధరావు, ఇంటికి వచ్చి, మేడ ఎక్కుతుండగా మళ్ళీ రజని ఏడుపు, అరుపులు. అతను ఓ క్షణం ఆగాడు. కానీ ఏంచేయలేక నిట్టూర్చి, పైకి నడిచాడు.

ప్రతిరోజూ అది మామూలైంది. రజని పట్ల అతనికి సానుభూతి ఎక్కువ అవుతూనే వుంది.

ఇప్పుడు తాగకుండా వస్తున్నాడు. 'రజని' కోసం. నీలతో రజని సంసారం గురించి చర్చిస్తున్నాడు.

తాగుడు తగ్గింది పూర్తిగా. సరాసరి ఇంటికే వస్తున్నాడు. నీలతో సరదాగా కబుర్లు చెబుతున్నాడు. ఇద్దరూ కలిసి సినిమాలకు వెళుతున్నారు. అతని కళ్ళు రజని కోసం వెతుకుతున్నాయి, కానీ ఆమె మాత్రం కనిపించడంలేదు.

భర్త మారినందుకు సంతోషించింది నీల...కానీ రజనిని తలుచుకుంటే పుట్టెడు దుఃఖం ముంచుకువస్తోంది. రజనికి తన మొహం చూపించలేక పోతున్నది.

ఆ రోజు ఎలాగైనా, 'వేణు'కాళ్లయినా పట్టుకుని 'రజని'ని బాధించవద్దని అడగాలనుకొన్నది. అందుకు



మన్మధరావు ప్రోత్సాహం కూడా వున్నది.

రజని కేకలు వినిపిస్తుండగా మేడ దిగివచ్చింది. తలుపులు తెరిచేవున్నాయి. నెమ్మదిగా లోపలికి వెళ్ళింది. పడక గదిలోంచి శబ్దాలు...కాస్త తెరతొలగించి తొంగి చూచింది. వేణు కౌగిలిలో రజని నవ్వుతూంది.

వేణు ఆమెను ముద్దులతో ముంచెత్తుతున్నాడు.

"అబ్బ! వుండండి" అంటూనే 'బాబోయ్,' అని కేకవేసింది.

"ఊఁ చాల్లేవోయ్, నీ నాటకం, వాళ్ళు నిద్రపోయి వుంటారీపాటికి...రా... తలుపులు వేసి, దీపం ఆర్పేయి" అని పిలుస్తున్నాడు. రజని, మత్తుగా, అతని పెదాల్ని ముద్దు పెట్టుకుని, 'జస్ట్ ఎ మినిట్' అన్నది.

"అమ్మ దొంగా" అనుకున్నది నీల ...కళ్లలో ఆనంద బాష్పాలు కదిలాయి. లేడిలా పరుగుదీసింది మేడపైకి....

వెళ్ళి అమాంతం మన్మధరావు చేతుల్లో వాలిపోయింది. ఎన్నడూ లేనంత ఆనందంగా, తృప్తిగా వుంది నీలకు ఆరోజు.